

5

**ఆరుతడి పంటలే ఆదుకుంటాయా?**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -50 బుధవారం 22జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ ఆందోళన

## రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్



**కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత**

**అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు**

**రాహుల్ గాంధీ మాట మార్చారు**

**: కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**

**న్యూఢిల్లీ,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. మిగతా 2లో.



# నీట్ పేపర్ లీక్ మహా పాపం



**నీట్ పేపర్ లీక్ దోషులకు అత్యంత కఠిన శిక్ష విధించాలన్న ప్రధాని మోదీ**

**పరీక్షల నిర్వహణకు పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించాలని సూచన**

**పార్లమెంటు ముట్టడికి యత్నించిన విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం**

**విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆందోళనకారుల డిమాండ్**

**నిరసనకారులతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా చర్చలు.. కొనసాగుతున్న ఉత్కంఠ**

**న్యూఢిల్లీ,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారికి అత్యంత కఠినమైన శిక్ష విధించాలని ఆయన పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను నిరోధించడం జాతీయ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఇవాళ జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ 'మంగళ్ మిలన్' సమావేశం మిగతా 2లో.




## 'తల్లికి వందనం' నేడే

**తొలి విడతలో ఈ రోజు 64.76 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి**

**తల్లుల బ్యాంకు ఖాతాల్లో 13 వేల చొప్పున జమ చేయనున్న ప్రభుత్వం**

**ఆగస్టు 30న రెండో విడత అమలు**

**అమరావతి,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
విద్యార్థుల చదువు వారి కుటుంబాలకు భారం కాకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం రెండో ఏడాది నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం నుంచే నిధుల విడుదల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ సారి రెండు విడతలుగా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. మిగతా 2లో.

## నలుగురు రైతులు చనిపోయినా

# బాధ్యత లేదా..?

### వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా

**కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందచేత**

**ఆదిలాబాద్,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేదు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేదు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన మిగతా



## డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

**ఉద్యమకారుల సమగ్ర సంక్షేమానికి పర్మినెంట్ కార్పొరేషన్**

**చట్టబద్ధత ఇవ్వాలని జెఎసిల డిమాండ్**



**హైదరాబాద్,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సంప్రదింపులు కొనసాగిస్తోంది. మంగళవారం వైద్యులు, న్యాయవాదులు, విలేఖరులుసమక్షంలో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, అద్దంకి దయాకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి పలువురు ప్రముఖ సామాజిక నాయకులు మరియు వివిధ వర్గాల అగశ్రేణి ప్రతినిధులు హాజరయ్యారు, అల్లం నారాయణ (సీనియర్ జర్నలిస్ట్ నాయకులు),

## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి




**ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు**

**కార్యాచరణతో ముందుకు సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం**

**రంగారెడ్డి,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిలా మిగతా 2లో.




## ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

**ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం**

**వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి**

**కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి**

**హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

**హన్మకొండ,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ మిగతా 2లో.

## వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు**

**ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి**

**హైదరాబాద్,జులై 21(జర్నలిస్ట్ వార్త);**
బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన మిగతా 2లో.



# ప్రధాని నివాసం ముందు కాంగ్రెస్ ఆందోళన

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ



అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో
ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్‌గాంధీ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా..?

నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరపున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరపున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో
రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ మహా పాపం

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేని పటిష్ఠమైన (ఫుల్‌ప్రూఫ్) వ్యవస్థను నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ప్రధాని కోరినట్లు రిజిజు తెలిపారు.చట్టసభల్లో ప్రభుత్వానికి మద్దతుగా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు ఐక్యంగా ఉండాలని ప్రధాని కోరారు. అదే సమయంలో ప్రతిపక్షాలు కూడా పార్లమెంటులో నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం ఎంపీలందరిపైనా ఉమ్మడి బాధ్యత ఉందని మోదీ అన్నట్లు రిజిజు వివరించారు.
నీట్ కుంభకోణంపై విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నిన్న పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన వందలాది మంది విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించి, లాఠీఛార్జ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను 'బొద్దింకలతో' పోల్చిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏర్పడిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తోంది.నీట్ పేపర్ లీక్ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని, నిందితుల అరెస్టులకు దారితీసిందని ప్రధాని చెప్పినట్లు రిజిజు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే తిరిగి పరీక్ష నిర్వహించామని మోదీ నొక్కిచెప్పారన్నారు. మరోవైపు ఈ ఉద్యమానికి మద్దతుగా 21 రోజుల పాటు నిరాహార దీక్ష చేసిన సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థులపై పోలీసుల దమనకాండను చూశాక, ఆసుపత్రి నుంచే తన దీక్షను కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు.
ఇదిలా ఉంటే.. తమను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో తమ నేతలు సమావేశమై డిమాండ్లతో కూడిన లేఖను సమర్పించారని సీజేపీ తెలిపింది. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని అంగీకరించిన నడ్డా, చర్చల ప్రతిపాదన నిరసనకారుల నుంచే వచ్చిందని స్పష్టం చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

**మొదటిపేజీ తరువాయి**

చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.
దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే




24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు తక్కువ నీటి అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్ గ్రాస్ వంటి ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పశుసంవర్ధక రంగానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై వెంటనే సమగ్ర నివేదికలు సిద్ధం చేసి అందించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పైస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు ప్రణాళికతో చర్యలు
చేపట్టడం ద్వారానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడగలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సామాజిక బాధ్యతతో పనిచేస్తే వర్షాభావ పరిస్థితులను విజయవంతంగా అధిగమించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, తెలంగాణ శాసనసభ డిప్యూటి స్పీకర్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డా. మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'తల్లికి వందనం' నేడే

**మొదటిపేజీ తరువాయి**

ఇప్పటికే యూడైస్ ద్వారా నమోదైన విద్యార్థులకు తొలి విడత బుధవారం నిధులు జమచేయనున్నారు. ఇక, ఈ ఏడాదే కొత్తగా స్కూళ్లలో చేరిన విద్యార్థులకు రెండో విడతలో ఆగస్టు 30న పథకాన్ని అమలు చేస్తారు. తొలి విడతలో 64.76 లక్షల మంది విద్యార్థులకు నిధులు అందనున్నాయి. బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిధుల జమ ప్రక్రియ కొనసాగుతుంది. ఇంకా వివరాలు ధృవీకరించాల్సిన విద్యార్థులు, ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో చేరేవారికి రెండో విడతలో నిధులు విడుదల చేస్తారు. మొత్తం ఈ ఏడాది 67.47 లక్షల మంది విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేయాలని పాఠశాల విద్యాశాఖ అంచనా వేసింది. 42.7 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ఈ నగదు జమ కానుంది. దీనికిగాను ప్రభుత్వం రూ.10,121 కోట్లు వెచ్చిస్తోంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలను ఈ పథకంలో కేటాయించారు. అయితే, ఆయా పాఠశాలల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయించి.. రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే 'అమ్మఒడి' అమలు చేయగా, కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. దీం తో గత ప్రభుత్వంతో పోలిస్తే దాదాపు రెట్టింపు నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి వస్తోంది.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గతంలో ఎన్నో విపత్తులు ఎదుర్కొన్నామని.. ఎన్‌లినోను కూడా ఎదుర్కుంటామన్నారు. అమ్మవారి కృపాకటాక్షంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు. సంవృద్ధిగా వర్షాలు పడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆషాఢమాస బోనాలు ఘనంగా జరిగేలా దేవాదాయ శాఖ తరఫున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని ఏర్పాట్లు చేసినా చిన్న చిన్న ఇబ్బందులు జరుగుతుంటాయని.. వాటిని అధిగమించి అమ్మవారిని భక్తులు దర్శనం చేసుకోవాలని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదం రాష్ట్ర మీద ఉండాలని, సుఖశాంతులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు.

# డాక్టర్లు, అడ్వకేట్లు, జర్నలిస్టుల జేఏసీలతో ముఖాముఖి

**మొదటిపేజీ తరువాయి**

ఎమ్. రాజేందర్ రెడ్డి (అడ్వకేట్ జేఏసీ కన్వీనర్), ఎస్. సత్యం రెడ్డి (హైకోర్టు మాజీ ప్రెసిడెంట్), టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. సమావేశానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత స్వయంగా హాజరై కమిటీకి తమ పూర్తి మద్దతును ప్రకటించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో నాటి ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పలు చారిత్రాత్మక జీవోల ప్రతులను కమిటీ ప్యానల్‌కు సమర్పించారు. జార్ఖండ్ తో పాటు ఇతర కొత్తగా ఏర్పాటైన రాష్టాల్లో అమలు చేసిన ఉద్యమకారుల గుర్తింపు విధానాలను పరిశీలించి, తెలంగాణలో త్వరితగతిన అర్హుల గుర్తింపు పక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. విజ్ఞప్తిపై కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు స్పందిస్తూ.. 'నేను జార్ఖండ్ రాష్ట్రానికి 3 సంవత్సరాల పాటు ఇన్ ఛార్జిగా పనిచేశాను. అక్కడ అమలైన విధానాలపై నాకు పూర్తి అవగాహన ఉంది. అంతకంటే మెరుగ్గా, నిబద్ధతతో తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం. అన్ని రాజకీయా పార్టీల నుండి, ప్రజా సంఘాల నుండి వచ్చే సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటాం' అని తెలిపారు. పర్మినెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ పోస్టులలో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిటీ సభ్యులు మాట్లాడుతూ.. జర్నలిస్టులు, డాక్టర్లు, అడ్వకేట్లు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రాన్ని సాధించారని, వారి ప్రతి డిమాండ్ అత్యంత సమంజసమైనదని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రికార్డ్ చేసిన ఆధారాల ద్వారా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, ఈ విజ్ఞప్తులన్నింటినీ క్రోడీకరించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నివేదిస్తామని స్పష్టం చేశారు.

----------------

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబంధించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

--------------

# సీజేపీ ఆందోళనలు.. విద్యార్థులతో చర్చలకు కేంద్రం సిద్ధం!

**న్యూఢిల్లీ, జూలై 21, ::** నీట్ ప్రశ్నపత్రం లీక్, విద్యా వ్యవస్థలో లోపాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం చేపట్టిన 'చలో పార్లమెంట్' యాత్ర ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో సీజేపీ ఆందోళనకు శాంతియుత పరిష్కారం చూపే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి ప్రతినిధులతో చర్చలకు సిద్ధమని కేంద్రం ప్రకటించినట్లు సమాచారం.
ఈ సమస్యలకు చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేస్తోంది. అందుకోసం ఆ దిశగా చర్యలు చేపట్టింది. విద్య మంత్రిత్వ శాఖ లేదా ఉన్నతాధికారుల స్థాయిలో విద్యార్థులతో సమావేశం నిర్వహించే ఆస్కారం ఉందని తెలుస్తోంది. దీంతో నీట్ నిర్వహించే చీూా పరీక్షా వ్యవస్థలో పారదర్శకతతో పాటు సంస్కరణల దిశగా ముందడుగు పడనుంది. సోమవారం చలో పార్లమెంట్ యాత్రలో విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని మంగళవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డా పరామర్శించారు. అనంతరం విద్యార్థులతో కేంద్రం చర్చలకు సుముఖంగా ఉందనే ప్రచారం ప్రారంభమైంది.నీట్ ప్రశ్నపత్రం లీక్, పోటీ పరీక్షల్లో అవకతవకలతో పాటు పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థి లోకం భగ్గుమంది. దీంతో జాతీయ స్థాయిలో విద్యార్థుల నిరసనలు, నిరాహార దీక్షలు ఉధృతమయ్యాయి. దాంతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి 'చర్చల కోసం తలుపులు తెరిచే ఉన్నాయని' కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మరో వైపు ఈ అంశంపై ప్రధాని మోదీకి విద్యావేత్తలతో పాటు సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ లేఖ రాసిన సంగతి తెలిసిందే.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..
బుధవారం 22జూలై 2026

# రోడ్డు కాదు.. గుంతలమయం

**తాళ్ల వీరప్పగూడెంవీర్లపాలెం రహదారి దుస్థితి**

**యాదాద్రి థర్మల్ ప్లాంట్ భారీ వాహనాలతో మరింత దెబ్బతిన్న రహదారి**

**తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారుల విజ్ఞప్తి**

**దామచర్ల /జులై21 ( జర్నలిస్ట్ వార్త)**



మండలంలోని తాళ్ల వీరప్పగూడెం నుంచి వీర్లపాలెం వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఈ మార్గంలోనే ఉండటంతో రోజూ భారీ లారీలు, ట్రాక్టర్లు, ఇతర సరకు రవాణా వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇప్పటికే దెబ్బతిన్న రహదారి మరింత పాడై, ప్రయాణానికి పూర్తిగా అననుకూలంగా మారింది.దామచర్ల నుంచి వీర్లపాలెం వైపు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు గుంతల కారణంగా ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు కనిపించక వాహనదారులు మరింత అవస్థలు పడుతున్నారు. స్థానిక గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు రోజూ ఇదే మార్గాన్ని వినియోగించాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అధికారులు, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి రహదారికి తక్షణ మరమ్మతులు చేపట్టాలని, శాశ్వతంగా బలోపేతం చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# జేఏసీ బలోపేతానికి నేడు కీలక భేటీ

**జిల్లామండల కమిటీల ఏర్పాటు, సభ్యత్వ నమోదు, ఉద్యమ కార్యాచరణపై చర్చ**



**హనుమకొండ బ్యూరో జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** ఉమ్మడి వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన బీసీఎస్సీఎస్టీమైనారిటీ జేఏసీ నాయకులకు కీలక సమావేశం బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు హంటర్ రోడ్‌లోని నంది హిల్స్ సమీపంలోని తెలంగాణ పిండివంటల వద్ద ఉన్న జేఏసీ కార్యాలయంలో జరగనుంది. రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర ముదిరాజ్, రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కొట్టే యోసేబు తెలిపారు.సమావేశంలో జిల్లా, మండల, గ్రామ కమిటీల నిర్మాణం, ఉమ్మడి జిల్లా కార్యాలయ ఏర్పాటు, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ చేపడుతున్న ఉద్యమాలు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర దిశానిర్దేశం చేయనున్నారు. సంస్థ విస్తరణ, ఉద్యమాల సమన్వయం, ప్రజా సమస్యలపై పోరాటాల తీరు వంటి అంశాలపై నాయకులకు అవగాహన కల్పించనున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి పొదుల సాయిబాబా, రాష్ట్ర కోఆర్డినేటర్ మేకల సుమన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన మండల ఇన్‌చార్జులు, కన్వీనర్లు, రాష్ట్ర బాధ్యులు, కోఆర్డినేటర్లు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని జేఏసీ నాయకత్వం పిలుపునిచ్చింది.

# గర్భిణులకు ఉచిత ఆటో సేవ

**మానవత్వం చాటుకున్న లతీఫ్**





**వైరా/ జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** గర్భిణీ స్త్రీలకు ఆస్పత్రులకు వెళ్లేందుకు ఉచిత ఆటో సేవ అందిస్తూ వైరా మండలం సిరిపురం కేజీ గ్రామానికి చెందిన లతీఫ్ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. మంగళవారం ముగ్గురు గర్భిణులను వివిధ ఆస్పత్రులకు తీసుకెళ్లి పరీక్షలు పూర్తయ్యాక సురక్షితంగా తిరిగి వారి ఇళ్ల వద్దకు చేర్చారు.పుణ్యపురం గ్రామానికి చెందిన ముతడారపు కళ్యాణిని వైద్య పరీక్షల కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి, పరీక్షల అనంతరం ఇంటి వద్ద దించారు. నారపనేనిపల్లి గ్రామానికి చెందిన కొండపనేని ఇందును తనికెళ్లలోని గ్రేస్ ఆస్పత్రికి తరలించి, చికిత్స అనంతరం ఇంటికి చేర్చారు. సిరిపురం కేజీ గ్రామానికి చెందిన బాసటి మాధవిని వైరాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు పూర్తయ్యాక సురక్షితంగా ఇంటి వద్ద దింపారు.గర్భిణులకు అత్యవసర సమయంలో ఎలాంటి చార్జీలు లేకుండా ఉచిత రవాణా సేవలు అందిస్తున్న లతీఫ్ సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. ఇటువంటి సేవలు గ్రామీణ ప్రాంత గర్భిణులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని పలువురు పేర్కొన్నారు.

## ముల్కనూర్‌లో పేకాట శిబిరంపై పోలీసుల దాడి.. నలుగురు అరెస్ట్

**భీమదేవరపల్లి/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** ముల్కనూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారం మేరకు ముల్కనూర్ పోలీసులు శిబిరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా, పోలీసులను గమనించిన మాడుగుల అలెగ్జాండర్ అక్కడి నుంచి పరారయ్యాడు. మిగిలిన మాడుగుల ప్రసాద్, మాడుగుల కృష్ణ, గునుకుంట్ల రాజయ్య, మాడుగుల బిషప్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,480 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై జూదం నిర్వహించినందుకు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మాడుగుల అలెగ్జాండర్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు

# దామెర ప్రశాంత్‌కు వర్ధన్నపేట ఎస్సీ విభాగం బాధ్యతలు





WARANGAL DISTRICT CONGRESS PARTY
SC DEPARTMENT COMMITTEE

CHILUVERU SRINIVAS
Chairman
DCC SC Department,
Warangal

H.No. 46-5-836,
Madhura nagar colony,
Enumamula Market,
Main Road, Kashibugga,
Warangal.
Cell : 9963059686

Ref. No.

Date : 19th July, 2026

ORDER

In consultation with Shri CHILUVERU SRINIVAS, Chairman, Warangal District Congress Committee SC Department, the proposals for the appointment of Mandal Chairmans in WARANGAL District has been approved, with immediate effect.

| Sl.No. | Name of the Mandal | Name of the Chairman |
|---|---|---|
| 1. | NALLABELLI | PARIKI PAVAN |
| 2. | NARSAMPET | ALUVALA SRINIVAS |
| 3. | CHENNARAOPET | KANNAM SANDEEP |
| 4. | NEKKONDA | POSHETTI BHANU |
| 5. | KHANAPURAM | BATHINI SUNIL |
| 6. | PARVATHAGIRI | NARUKUDU RAVINDER |
| 7. | WARDHANNAPET | PRASHANTH |
| 8. | GEESUGONDA | KOMMULA VINAY |
| 9. | SANGEM | KATLA NAGARAJU |
| 10. | RAYAPARTHI | KANDIKATLA YAKAIAH |

We sincerely hope and trust you will strengthen the Congress party by striving hard and put in every nerve to build up the organization from gross-root level.

(CHILUVERU SRINIVAS)
Chairman, DCC SC Department,
Warangal.



**వర్ధన్నపేట/ జులై 21(జర్నలిస్ట్ వార్త);** వర్ధన్నపేట మండల కాంగ్రెస్ ఎస్సీ విభాగం నూతన అధ్యక్షుడిగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు దామెర ప్రశాంత్ నియమితులయ్యారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎండీ ఆయూబ్, జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ మంగళవారం ప్రశాంత్‌కు నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా దామెర ప్రశాంత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అయూబ్, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్ రాజ్, మండల పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థానం అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్తన్న, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భానుప్రసాద్, జిల్లా నాయకులు అబ్బిడి రాజిరెడ్డితో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులకు, మండల నాయకులకు, కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.
పార్టీ శ్రేణులను ఏకం చేస్తూ వర్ధన్నపేట మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# ఓటు నమోదు జాప్యానికి తావులేదు

**రెండు రోజుల్లో 95 శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి -తక్కువ పురోగతి ఉన్న బీఎల్‌ఓలకు అధికారుల హెచ్చరిక**

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పనిచేయాలని బీఎల్‌ఓలకు అధికారులు స్పష్టం చేశారు. ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ మాచర్ల జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఓటరు నమోదు పురోగతిపై సమీక్ష నిర్వహించి, తక్కువ శాతం నమోదు చేసిన బీఎల్‌ఓలకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటే ప్రాణాధారం అని, అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగలకూడదని అన్నారు. పురోగతి ఆశించిన



స్థాయిలో లేని బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఓటు అమూల్యమైనదని, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదయ్యేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఎంపీడీవో అనిల్ కుమార్ డీటీ సంతోష్ మాట్లాడుతూ, మిగిలిన, ఎన్యూమరేషన్ ఫారాలను నిబంధనలకు అనుగుణంగా ఎలా పూర్తి చేయాలనే అంశంపై బీఎల్‌ఓలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఫారాల పరిశీలనలో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు మేరకు మరో రెండు రోజుల్లోగా కనీసం 95 శాతం ఎన్యూమరేషన్ పూర్తి చేసి లక్ష్యాన్ని సాధించాల్సిందేనని స్పష్టం చేశారు.
ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన వారందరి వివరాలను నమోదు చేయాలని అధికారులు బీఎల్‌ఓలకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, ఇతర శాఖల అధికారులు, వార్డు సభ్యులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# వికలాంగుల హామీలేవి..?

**జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో రాజకీయ రిజర్వేషన్ తర్వాతే పోలింగ్**

**వికలాంగుల డైరెక్టర్‌కు గిద్దె రాజేష్ వినతి.. అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన హెచ్చరిక**

**హైదరాబాద్, /జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ విమర్శించారు. వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మంగళవారం మలక్‌పేటలోని రాష్ట్ర వికలాంగుల డైరెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలుకు పెంచడం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయడం, వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా ఏర్పాటు చేయడం,




వికలాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవడం వంటి హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ ఇప్పటివరకు వాటిలో ఏ ఒక్కటీ అమలు కాలేదని ఆరోపించారు.జనాభా దామాషా ప్రకారం వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించేలా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, ఈ అంశంపై వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించాలని కోరారు.వికలాంగుల హక్కుల చట్టం2016 ప్రకారం రాష్ట్ర వికలాంగుల కమిషనర్‌గా అర్హత కలిగిన దివ్యాంగుడినే నియమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తన హామీల అమలులో విఫలమైతే నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలని గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాస్, వీరస్వామి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో సమాజంలో వెలుగులు నింపాలి

**చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హసన్‌పర్తి/ జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** సేవా కార్యక్రమాలు సమాజానికి అండగా నిలవడంతో పాటు నిరుపేదల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని మహాలక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గొడుగుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని చిరు వ్యాపారులకు గొడుగులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో రోడ్ల పక్కన, ప్రధాన కూడళ్లలో రోజంతా ఎండా, వానా లెక్కచేయకుండా జీవనోపాధి సాగిస్తున్న మహిళలు, వృద్ధులు, చిరు వ్యాపారులకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలతో వెలుగులు నింపేందుకు స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రోటరీ క్లబ్ గతంలో విద్యార్థులకు





సైకిళ్ల పంపిణీ, ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తుచేసిన ఆయన, భవిష్యత్తులోనూ మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్‌రాజ్, గొడుగుల దాత కోరే చంద్రమౌళి, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సోమ వేణుగోపాల్, కార్యదర్శి నాయిని అనిల్‌కుమార్, కోశాధికారి జూలూరి కృష్ణమూర్తి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వేణుగోపాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మెరుగు రాజేష్‌గౌడ్, 65వ డివిజన్ అధ్యక్షుడు సునీల్, సీనియర్ నాయకులు తోకాల లక్ష్మారెడ్డి, కనపర్తి కిరణ్, వీసం సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# వరంగల్ పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం

## మడికొండలో ఘనంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

### డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ శ్రేణుల హర్షాతిరేకం





**హసన్‌పర్తి/, జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్‌హనుమకొండ జిల్లాల పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మడికొండలో మంత్రి రాక సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మడికొండకు చేరుకుని మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేయాలని మంత్రి సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొందని నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, రెవెన్యూ సేవలను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. మంత్రి స్వాగత కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# అక్రమ మొరం రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

## టిప్పర్ లారీ స్వాధీనం.. యజమాని, డ్రైవర్‌పై కేసు

### అనుమతులు లేకుండా గట్ల నర్సింగాపూర్ నుంచి తరలింపు



**హసన్‌పర్తి, /జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** అక్రమంగా మొరం (గ్రావెల్) తరలిస్తున్న టిప్పర్ లారీని హసన్‌పర్తి పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో లారీ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో ఎ. మహేందర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు ఏఎస్సై ఆర్. మల్లికార్జున్ సిబ్బందితో కలిసి హసన్‌పర్తి బస్టాండ్ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో మొరం లోడుతో వెళ్తున్న టీఎస్-03-యూసీ-9461 టిప్పర్ లారీ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో గట్ల నర్సింగాపూర్ గ్రామం నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్నట్లు గుర్తించారు. హనుమకొండకు చెందిన లారీ యజమాని పల్లాపు రాజు ఆదేశాల మేరకే ఈ రవాణా జరుగుతోందని, డ్రైవర్ వడ్డేపల్లికి చెందిన కొగిల్ల తిరుపతి విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సాక్షుల సమక్షంలో మొరం లోడుతో ఉన్న టిప్పర్ లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లారీ యజమాని పల్లాపు రాజు, డ్రైవర్ కొగిల్ల తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో ఎ. మహేందర్ వెల్లడించారు. అక్రమ మైనింగ్, ఖనిజాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# హసన్‌పర్తిలో బాలకార్మికుడి రక్షణ

## రోడ్డు నిర్మాణ పనుల్లో మైనర్‌తో పని.. సూపర్‌వైజర్‌పై కేసు

### ఆపరేషన్ ముస్కాన్‘లో ఉమ్మడి తనిఖీ బృందం చర్య

**హసన్‌పర్తి/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):**
రోడ్డు నిర్మాణ పనుల్లో మైనర్ బాలుడితో ప్రమాదకరమైన పనులు చేయిస్తున్న ఘటనను హసన్‌పర్తి పోలీసులు గుర్తించి బాలుడిని రక్షించారు. బాలుడిని పనిలో పెట్టుకున్న సూపర్‌వైజర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు ఎస్‌ఐ బి. సుజిత్ తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ‘ఆపరేషన్ ముస్కాన్‘లో భాగంగా సోమవారం ఉమ్మడి తనిఖీ బృందం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల క్రాస్ రోడ్స్ వద్ద తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఓ రోడ్డు నిర్మాణ స్థలంలో మైనర్ బాలుడితో ప్రమాదకరమైన పనులు చేయిస్తున్నట్లు గుర్తించింది. వెంటనే బాలుడిని అక్కడి నుంచి రక్షించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరుపరిచిన అనంతరం బంధువులకు అప్పగించారు.

బాలుడిని అక్రమంగా పనిలో నియమించుకున్న యానాంకు చెందిన సూపర్‌వైజర్ మల్లిపాముల లోవరాజుపై బాల కార్మిక నిషేధ చట్టాల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలకు సిఫార్సు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ.. బాల కార్మికులను నియమించడం చట్టవిరుద్ధమని, చిన్నారులతో పనులు చేయించే యజమానులు, కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# డీజిల్ లేక గర్భిణులకు గండం..!

## కరెంటు పోతే ఆపరేషన్లకు బ్రేక్ -జనరేటర్‌కు ఇంధనం లేదు.. ఓపీ, పీడియాట్రిక్ సేవలు స్తంభింపు

## అత్యవసర మందులూ కరువు.. అంబులెన్సులకూ డీజిల్ కష్టమే -మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో దయనీయ పరిస్థితులు

**నర్సంపేట/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట ప్రభుత్వ మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో డీజిల్ కొరత తీవ్ర సమస్యగా మారింది. జనరేటర్‌కు ఇంధనం లేక విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రతిసారి ఆపరేషన్లు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం. గర్భిణులు, చిన్నారులకు సేవలు అందించే ఈ ఆస్పత్రిలో కనీస సౌకర్యాల లేమితో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న పాత ఏరియా ఆస్పత్రిని ఇటీవల మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిగా మార్చిన ప్రభుత్వం, అవసరమైన వనరుల కల్పనలో విఫలమైందన్న విమర్శలువినిపిస్తున్నాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు జనరేటర్ నడపడానికి డీజిల్ లేకపోవడంతో అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవాలు కూడా వాయిదా పడుతున్నాయని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఓపీ సేవలు, పీడియాట్రిక్ విభాగం పనితీరు కూడా విద్యుత్‌పై ఆధారపడటంతో సేవలు అంతరాయం కలుగుతున్నాయి. ఇదిలా ఉండగా, అత్యవసర పరిస్థితుల్లో అవసరమయ్యే పాంటాప్, అవిల్ వంటి ప్రాథమిక అత్యవసర మందులు కూడా ఆస్పత్రిలో అందుబాటులో లేవని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. దీంతో రోగులను ప్రైవేట్ ఆస్పత్రులు లేదా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి




తరలించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆస్పత్రికి చెందిన అంబులెన్సులు సైతం డీజిల్ లేక నిలిచిపోతున్నాయని తెలుస్తోంది. అత్యవసరంగా రోగులను తరలించాల్సిన సమయంలో వాహనాలు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు.

ఈ విషయమై ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించగా, డీజిల్ కోసం ప్రత్యేక బడ్జెట్ లేదని, గతంలో వినియోగించిన డీజిల్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదని సమాధానం ఇస్తున్నట్లు సమాచారం. నిధుల కొరత కారణంగా ఈ పరిస్థితి నెలకొందని వారు చెబుతున్నట్లు తెలిసింది. గర్భిణులు, చిన్నారులకు కీలక సేవలు అందించే ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న ఈ పరిస్థితులపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీజిల్, అత్యవసర మందుల కొరతను వెంటనే తీర్చడంతో పాటు వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు, రోగుల బంధువులు కోరుతున్నారు.

# ఓయో రూమ్‌కు రాకపోతే చంపేస్తా..

### మహిళ ఫిర్యాదుతో హరికృష్ణపై కేసు నమోదు చేసిన ముల్కనూర్ పోలీసులు

**భీమదేవరపల్లి/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలానికి చెందిన ఓ వివాహిత మహిళతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, ఆమెను ఓయో రూమ్స్‌కు రావాలని ఒత్తిడి చేసి, వెళ్లేందుకు నిరాకరించడంతో ఆమెను, ఆమె కుమారుడిని చంపేస్తానంటూ బెదిరించిన ఘటనపై ముల్కనూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన పెదవేనా హరికృష్ణ అనే వ్యక్తి బాధిత మహిళను పలుమార్లు వేధిస్తూ, అసభ్యకరంగా మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక, ఓయో రూమ్స్‌కు రావాలని ఒత్తిడి చేయడంతో పాటు, రాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఆమెతో పాటు ఆమె కుమారుడిని కూడా చంపేస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముల్కనూర్ పోలీసులు నిందితుడు పెదవేనా హరికృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయని పోలీసులు తెలిపారు.

# మధుమేహ నిర్ధారణ శిబిరం విజయవంతం

## లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**నర్సంపేట/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):**
లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెంకటేశ్వర హాస్పిటల్‌లో ఉచిత మధుమేహ నిర్ధారణ, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు



డా. వజ్జా సాగర్ పాల్గొని మధుమేహ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలు, ఆహార నియమాలు, జీవనశైలి మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శిబిరానికి హాజరైన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ అధ్యక్షులు మోతే ఇంద్రసేనారెడ్డి, జోనల్ చైర్మన్ మోతే సమ్మిరెడ్డి, సభ్యులు గోగుల ప్రభాకర్ రెడ్డి, వీరమల్ల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

# టీసీసీ ముఖ్య కార్యకర్తల సమావేశం

## బెన్నీ రియాన్ జన్మదిన వేడుకలు.. చిన్నారికి ఆశీర్వాదాలు

**ఖమ్మం,/ జూలై 21 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ క్రిస్టియన్స్ కౌన్సిల్ (టీసీసీ) పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మానుకొండ కిరణ్ కుమార్ కుమారుడు బెన్నీ రియాన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిషప్ మానుకొండ సుదర్శన్ మాట్లాడుతూ, చర్చిల్లో పాస్టర్లు బైబిల్ సందేశాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ప్రజల్లో బైబిల్ అధ్యయన తరగతులు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక విలువలను



పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రార్థన సమయాల్లో ప్రతి విశ్వాసి అప్రమత్తంగా ఉండి దేవుని మార్గంలో నడవాలని ఉపదేశించారు. అనంతరం బెన్నీ



రియాన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీసీసీ సభ్యులు, పాస్టర్లు, దైవ సేవకులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత.. నీటి భద్రతకు బాట

### జల్ సంచయ్ జన్ భాగిధారి3.0లో ప్రజల భాగస్వామ్యానికి పిలుపు

**వైరా/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):**
భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ప్రతి పౌరుడు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని అధికారులు పిలుపునిచ్చారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జల్ సంచయ్ జన్ భాగిధారి (జేఎస్‌జేబీ3.0) కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు ఫిషరీస్ కాలనీలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నిమ్మతోట శ్రావణి, టీపీబీఓ మల్లేష్, మెప్మా ఆర్‌పీ విజయలక్ష్మి



ఆధ్వర్యంలో వార్డు ప్రజలకు నీటి సంరక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, నీటి వృథాను అరికట్టడం, భూగర్భ జలాలను పెంపొందించడం, చెరువులను పరిరక్షించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ప్రతి ఇంటిలో ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలమట్టం పెరిగి భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. నీటి ప్రతి బొట్టు అమూల్యమైనదని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నీటి సంరక్షణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్ నినో ముప్పును ఎదుర్కొనేందుకు సన్నద్ధం

## వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి



**హనుమకొండ/జులై 21(జర్నలిస్ట్ వార్త):**
ఎల్ నినో ప్రభావంతో ఉత్పన్నమయ్యే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమైందని వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పేర్కొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ నినో వల్ల తలెత్తే వర్షాభావ పరిస్థితులు, తాగునీటి ఎద్దడి, వ్యవసాయ రంగంపై పడే ప్రభావంపై మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. ఎక్కడా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు ఆదేశించారు. అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచిస్తూ, వర్ధన్నపేట నియోజకవర్గంలో తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు స్థానిక పురపాలక వర్గం సిద్ధంగా ఉందని తెలిపారు.

# మద్యం.. ఇసుక మాఫియాతో బీఆర్ఎస్ దోపిడీ

## ఉనికి కోసం కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు -ఎల్కతుర్తిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ ధ్వజం

**ఎల్కతుర్తి/జూలై 21 (జర్నలిస్ట్ వార్త):**
పదేళ్ల పాలనలో మద్యం, ఇసుక మాఫియాలకు అండగా నిలిచి కోట్ల రూపాయలు దోచుకున్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఉనికి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మండిపడ్డారు. మండల కేంద్రంలో మంగళవారం పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా ప్రచారం చేసిన కాళేశ్వరం నాసిరకం నిర్మాణాల కారణంగానే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని విమర్శించారు. అది బీఆర్ఎస్ అవినీతికి నిదర్శనమని పేర్కొన్నారు.
విద్యుత్ అంశంపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోందని, రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోందని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకేనని, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఆ పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు.నిరుద్యోగంపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు



విడ్డూరంగా ఉన్నాయని, పదేళ్ల పాలనలో ఉద్యోగాల భర్తీని నిర్లక్ష్యం చేసి, పరీక్షా పత్రాల లీకేజీలతో యువత భవిష్యత్తును దెబ్బతీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 67,760 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు 11,062 డీఎస్సీ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టిందని చెప్పారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3తో పాటు పోలీసు, విద్య, వైద్యం, రెవెన్యూ తదితర శాఖల్లో పారదర్శకంగా నియామకాలు జరుగుతున్నాయని వివరించారు.బీఆర్ఎస్ నేతల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వాటిని చూసి నవ్వుకుంటున్నారని ముప్పు శ్రీనివాస్ అన్నారు.సమావేశంలో పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, పుల్లూరి శ్రీధర్‌రావు, గోలి రాజేశ్వరరావు, రాజన్నగౌడ్, చల్ల రమణారెడ్డి, వీరమల్ల రంజిత్‌రెడ్డి, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలే ఆదుకుంటాయా?

## అనిశ్చిత వర్షాలు.. మండుతున్న ఎండలు.. నీటి కోసం ఆరాటం

### పంటల ఎంపికలో మార్పు తప్పదంటున్న వ్యవసాయ నిపుణులు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో:**
ప్రకృతి మారుతోంది... కానీ రైతు సాగు తీరు మాత్రం మారడం లేదు. ఒకప్పుడు ఋతువులు చెప్పిన సమయానికి వచ్చేవి. ఇప్పుడు ఎప్పుడు వర్షం పడుతుందో, ఎప్పుడు ఎండలు మండుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. వర్షాల అస్థిరత, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాల క్షీణత, సాగునీటి కొరత తెలంగాణ రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయినప్పటికీ అధిక నీటి అవసరమున్న పంటలకే ప్రాధాన్యం ఇవ్వడం రైతులను నష్టాల ఊబిలోకి నెడుతోందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.
తెలంగాణలో సుమారు 60 నుంచి 70 శాతం సాగు వర్షాధారంగానే కొనసాగుతోంది. గత ఐదారు సంవత్సరాలుగా వర్షాల పంపిణీలో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకే రోజులో భారీ వర్షాలు కురవడం, ఆ తర్వాత రెండు మూడు వారాలపాటు చినుకు కూడా పడకపోవడం సాధారణమైంది. దీంతో పంటలు ఎదుగుదల దశలోనే తేమ కొరతను ఎదుర్కొంటున్నాయి. చెరువులు పూర్తిస్థాయిలో నిండడం లేదు. బోర్లలో నీటి మట్టం క్రమంగా దిగజారుతోంది. సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### వరి సాగు... భారమవుతోందా?

అధిక పెట్టుబడి, ఎరువులు, కూలీల వ్యయం, విద్యుత్‌పై ఆధారపడే సాగునీరు... ఇలా వరి సాగు ఖర్చు ఏటా పెరుగుతోంది. పంట చేతికొచ్చే వరకు వర్షాలు సహకరించకపోతే రైతు అప్పుల పాలవుతున్నాడు. దిగుబడి వచ్చినా మార్కెట్ ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతుకు మిగిలేది నిరాశే.

### ఆరుతడి పంటలే ప్రత్యామ్నాయం

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జొన్న, సజ్జ, రాగులు, కంది, పెసర, మినుము, శనగ, నువ్వులు వంటి ఆరుతడి పంటలే భవిష్యత్తుకు భరోసా అని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. ఈ పంటలకు తక్కువ నీరు సరిపోతుంది. కరువును తట్టుకునే శక్తి ఎక్కువ. పెట్టుబడి కూడా తక్కువ. కొన్ని పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చే అవకాశాలు మెరుగ్గా



ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

### ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాలి

వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవాలంటే పంటల ఎంపికతో పాటు నీటి సంరక్షణ కూడా అత్యంత కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. పొలాల్లో గట్లు ఏర్పాటు చేయడం, మల్చింగ్, అంతర దుక్కి చేపట్టడం, ఫామ్‌పాండ్లు, చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయడం వల్ల నేలలో తేమ ఎక్కువకాలం నిలిచి పంటలకు మేలు జరుగుతుంది. భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

### శాస్త్రీయ సాగుతోనే లాభం

వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ విత్తనాలు వేయడం, నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం, కరువును తట్టుకునే వంగడాలను ఎంపిక చేసుకోవడం, పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయడం, పంట బీమాలో నమోదు చేసుకోవడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

### వ్యవసాయ శాఖ సూచనలు

ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల విస్తీర్ణాన్ని తగ్గించాలి.వాతావరణ అంచనాలకు అనుగుణంగా విత్తనాలు వేయాలి.
కరువును తట్టుకునే విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి.నేల పరీక్షలు చేయించి శాస్త్రీయంగా ఎరువులు వినియోగించాలి.వర్షపు నీటిని నిల్వ చేసుకునే చర్యలు చేపట్టాలి.నేలలో తేమను కాపాడే పద్ధతులు పాటించాలి.పంటల మార్పిడి విధానాన్ని అమలు చేయాలి.పంట బీమాలో నమోదు చేసుకోవాలి.స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలతోనే పంటల సాగు చేపట్టాలి.

### సాగు మారితేనే రైతు నిలబడతాడు

వాతావరణాన్ని మార్చడం మన చేతుల్లో లేదు. కానీ వాతావరణానికి అనుగుణంగా సాగు విధానాన్ని మార్చుకోవడం మాత్రం రైతు చేతుల్లోనే ఉంది. నీటి లభ్యత, నేల స్వభావం, వర్షపాతం ఆధారంగా పంటలను ఎంపిక చేసుకుంటేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. మారుతున్న ప్రకృతిని అర్థం చేసుకుని ఆరుతడి పంటల వైపు అడుగులు వేయడమే నేటి రైతుకు నిజమైన రక్షణ కవచమని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. నేటి నిర్ణయమే రేపటి రైతు భవిష్యత్తును నిర్ణయిస్తుందని వారు స్పష్టం చేస్తున్నారు.

# పోలవరాన్ని గాలికి వదిలేసిన జగన్

## ఇరిగేషన్ వ్యవస్థను విధ్వంసం చేశారు

## మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల


**అమరావతి,జులై 21(జర్నలిస్ట్ వార్త):**
నీటి ప్రాధాన్యాన్ని టిడిపి వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకూ గుర్తించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు పోలవరం, ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఒకవైపు వెంటిలేటర్‌పై



ఉన్న ఆర్థిక వ్యవస్థ .. మరోవైపు విధ్వంసమైన ఇరిగేషన్‌ను అప్పగించారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. నేడు ఇరిగేషన్ శాఖ.. క్యాలెండర్‌ను కూడా రూపొందించుకున్నట్లు తెలిపారు. పోలవరం రాష్ట్రానికి వరం, జీవమన్నారు. 72 శాతం పోలవరాన్ని నాడే పూర్తిచేశామని.. అప్పట్లో టీడీపీ ప్రభుత్వమే కొనసాగి ఉంటే పోలవరం 2021-22 నాటికే పూర్తయ్యేదని చెప్పుకొచ్చారు. 2019లో అధికారంలో ఉన్న నాటి ప్రభుత్వం 17 నెలలు పాటు ప్రాజెక్టును గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నాటి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. చివరకు పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను కూడా మళ్లించారని ఆరోపించారు. పోలవరం రీయింబర్స్‌మెంట్ సొమ్ములను కూడా నాటి ప్రభుత్వం దారి మళ్లించిందని మండిపడ్డారు. పోలవరానికి సంబంధించి ఈసీఆర్ఎఫ్ డ్యాం అత్యంత కీలమని.. డ్యాం పనులు 31 శాతం పూర్తయ్యిందని మంత్రి వెల్లడించారు. రైట్, లెఫ్ట్ కనెక్టివిటీని పూర్తిచేయడానికి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు ఈ రెండేళ్లలోనేరూ. 2250 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రశ్నార్థకమైన ప్రాజెక్టును తిరిగి కాపాడామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు

# తమ్మినేని సీతారాంనకు చుక్కెదురు

## క్వాష్ పిటిషన్ తిరస్కరించన ఎపి హైకోర్టు



**అమరావతి,జులై 21(జర్నలిస్ట్ వార్త):**
మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయస్థానం.. ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జులై 29కి వాయిదా వేసింది. నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

# భర్తల ఉద్యోగాలు ఊడేలా భార్యల ఫిర్యాదులు

## : సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన

### భర్తలు పనిచేసే సంస్థలకు కొందరు భార్యలు ఫిర్యాదు చేస్తున్నారన్న సుప్రీంకోర్టు

**జులై 21(జర్నలిస్ట్ వార్త):**వైవాహిక వివాదాల నేపథ్యంలో కొందరు మహిళలు తమ భర్తలు పనిచేసే సంస్థలకు ఫిర్యాదులు చేస్తూ, వారి జీవనోపాధి దెబ్బతినేలా ప్రవర్తించడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల వల్ల భర్తలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, అది చివరికి భార్యలకు అందే భరణం (జీవనభృతి)పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అత్యున్నత కోర్టు స్పష్టం చేసింది. అసోంలో నమోదైన ఒక పరువునష్టం కేసును ఉత్తర్ ప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల



ధర్మాసనం విచారణ చేపట్టింది.
ఈ విచారణ సందర్భంగా జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానిస్తూ.. “ఇటీవలి కాలంలో వివాహ సంబంధిత గొడవల వల్ల భర్తలు పనిచేసే కంపెనీలు లేదా సంస్థలకు భార్యలు ఫిర్యాదు చేయడం ఒక ధోరణిగా మారింది. విడాకులు కోరడం వేరు. కానీ జీవిత భాగస్వామి జీవనోపాధినే దెబ్బతీయడం అత్యంత తీవ్రమైన అంశం“ అని అభిప్రాయపడ్డారు. ఈ కేసులో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారైన తన భర్త సేవా నియమాలకు విరుద్ధంగా వ్యక్తిగత వ్యాపారం నడుపుతున్నాడంటూ సదరు మహిళ ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆమెపై భర్త స్నేహితుడు పరువునష్టం కేసు దాఖలు చేశారు.
ఇరువైపులా వాదనలు విన్న సుప్రీంకోర్టు, ఈ వివాదంలో సామరస్యపూరిత పరిష్కారానికి అవకాశం ఉందేమో పరిశీలించేందుకు కేసును మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపింది. పరస్పర ఆరోపణలన్నీ విరమించుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని మహిళకు అత్యున్నత కోర్టు సూచించింది.